సాక్షి
వికారాబాద్

శనివారం । 12 । జూలై । 2025



కాసుల కక్కుర్తి

ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకూ హెచ్చుమీరుతున్నాయి. శస్త్ర చికిత్సల పేరుతో దోచుకుంటున్నారు. 8లో▸



గుడ్డు లేదు!

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి బిల్లుల గండం వేధిస్తోంది. 8లో▸



ప్లాస్టిక్‌తో ప్రాణాలకు ముప్పు

ప్లాస్టిక్ వాడటంతో మానవాళికి ముప్పు ఉందని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్ సంబురాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

తాండూరు టౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలా అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే చేయించి, బీసీలకు ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. వెనుకబడిన తరగతి వర్గాల ప్రజలు సైతం రాజకీయాల్లో రాణించాలనే సదుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం దేశ వ్యాప్తంగా కులగణన ప్రక్రియ చేపట్టి బీసీలను రాజ్యాధికారం దిశగా పయనించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, నాయకులు సంతోష్, వెంకటయ్య, శ్రీనివాస్, జిలాని, అనిల్, భీంశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

తాండూరు టౌన్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయడంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అంతే కాకుండా విద్య, ఉద్యోగ, కాంట్రాక్టులకు సంబంధించి బీసీ రిజర్వేషన్లు వర్తించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి షుకూర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మధులత, నియోజకవర్గ అధ్యక్షురాలు అనిత, విజయలక్ష్మి, జగదీశ్వరి, వెంకటేష్, పరమేష్, రాము, సురేష్, శివ, బస్వరాజ్ నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన మాట నిలుపుకొన్నాం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

పరిగి: కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి జూపల్లి

అనంతగిరి: వికారాబాద్‌లో నిర్మించిన ఎక్సైజ్ స్టేషన్ నూతన భవనాన్ని శనివారం రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ పాల్గొంటారన్నారని ఆయన చెప్పారు.

వడ్డీ తిరిగొచ్చింది!



కొడంగల్ నియోజకవర్గంలో సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

రెండేళ్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

- జిల్లాలో స్వయం సహాయక సంఘాలు 10,805
- విడుదలైన మొత్తం రూ.32.66 కోట్లు
- నేటి నుంచి మహిళా సంఘాలకు అందజేత
- కసరత్తు చేస్తున్న డీఆర్డీఏ అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న సభ్యులు

వికారాబాద్: ప్రభుత్వం ఎట్టకేలకు మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ నిధులు విడుదల చేసింది. 2023 మార్చి నుంచి 2025 మార్చి వరకు రెండేళ్ల పాటు సభ్యులు బ్యాంకులకు చెల్లించిన మొత్తాన్ని విడుదల చేసింది. తొలుత 22 నెలలకు సంబంధించిన డబ్బులు మంజూరవగా తాజాగా మరో రెండు నెలల నిధులు తిరిగొచ్చాయి. ఈ మొత్తాన్ని మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేసేందుకు డీఆర్డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియను వేడుకలా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా కళాజాత బృందాలతో నియోజకవర్గ స్థాయిలో అవగాహన చేపట్టనున్నారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వడ్డీ రాయితీ, బ్యాంక్ లింకేజీ రుణాలు, ప్రమాద బీమా చెక్కులను అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వడ్డీ రాయితీ చెల్లింపు ఇలా..

మహిళా సంఘాలకు ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తుంటాయి. రుణం పొందిన సభ్యులు నెలకు రూ.100కు 9.5శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. సభ్యులు బ్యాంకులకు చెల్లించిన ఈ మొత్తాన్ని ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ చేస్తుంది. తద్వారా వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అవుతుంది. ఎప్పటికప్పుడు కాకుండా ప్రభుత్వం రెండు మూడేళ్లకు ఒక్కసారి నిధులు విడుదల చేస్తోంది. ఈ సొమ్మును సంఘం సభ్యులకు పంచనున్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే సర్కారు లక్ష్యం.

10,805 సంఘాలకు లబ్ధి

జిల్లాలో మొత్తం 657 గ్రామైక్య సంఘాలు ఉండగా వీటి పరిధిలోని 16,054 స్వయం సహాయక సంఘాల్లో 1,63,703 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందులో 10,805 సంఘాలు రుణాలు పొందేందుకు అర్హత సాధించాయి. నాలుగేళ్లగా ఈ గ్రుపులకు రుణాలు ఇస్తున్నారు. వీటి ఖాతాల్లోనే ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ రాయితీ జమ చేయనున్నారు. ఇటీవల 2023 మార్చి నుంచి 2025 జనవరి వరకు రూ.28.38 కోట్లు విడుదల చేయగా తాజాగా మారోసారి నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన రూ.4.28 కోట్లు మంజూరయ్యాయి. దీంతో రూ.32.66 కోట్లు సంఘాల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ వారంలో ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇవ్వాల్సిన మరో రెండు సంవత్సరాల బకాయిలు ఇంకా పెండింగులోనే ఉన్నాయి. ఈ మొత్తం రూ.30 కోట్ల వరకు ఉండొచ్చని తెలిసింది. ఇవి గత ప్రభుత్వ హయాంలోవి కావడంతో ఇస్తారో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాము చెల్లించిన వడ్డీ డబ్బులు తిరిగి రావడంపై మహిళా సమాఖ్య సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు చెల్లించడం ఎంతో సంతోషంగా ఉంది. ఇటీవలే తమ సంఘానికి వడ్డీ డబ్బులు జమ య్యాయి. ఇంకా తొమ్మిదేళ్ల వడ్డీ డబ్బులు రావాల్సి ఉంది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సత్యమ్మ, సంఘం సభ్యురాలు, బొంపల్లి

కొన్ని సంఘాలకే నిధులు



వడ్డీ డబ్బులు కొద్ది మొత్తంలో విడుదల చేశారు. దీంతో కొన్ని సంఘాలకే నిధులు అందాయి. మండలంలో చాలా సంఘాలకు వడ్డీ చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఆ దిశ చొరవ చూపి సకాలంలో డబ్బు అందేలా చూడాలి.

– పద్మమ్మ, సంఘం సభ్యురాలు, బొంపల్లి

సదుపాయాలపై శ్రద్ధ

పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై నజర్



సమస్యలను నోట్ చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఫోన్ ఇన్

- ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి
- తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి
- ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన



తాండూరు: ప్రజల భాగస్వామ్యంతోనే తాండూరు మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. వాటిని సావధానంగా ఆలకించిన ఆయన వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డీఈఈ మణిపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, ఆర్‌ఐలు అశోక్, రమేష్, టీపీపీఓలు శాంతిప్రియ, నరేష్, వంశీ, టీఎంసీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశ్న: మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో రోడ్డు పైనే చెత్త వేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పాత తాండూరులోని హనుమాన్ ఆలయం వద్ద కాలువల్లో మురుగు తీయడం లేదు. ఉన్న కాల్వలు ధ్వంసమయ్యాయి. దోమల బెడద ఎక్కువగా ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– నారా రాకేష్, పాతతాండూరు

కమిషనర్: మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లపై చెత్త వేయకుండా ముగ్గులు వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 12వ వార్డులో పార్కులు అధ్వానంగా మారాయి. పిల్లలు ఆడుకునేందుకు వీలులేకుండా పోయింది. పార్కు స్థలంలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వీధి దీపాలు సైతం వెలగడం లేదు. 28వ వార్డులోని శాంతినగర్ పార్కు అధ్వానంగా ఉంది.వాటిని బాగు చేయాలి.

– మేరి విజయకుమార్, 12వ వార్డు, జమీర్, 28వ వార్డు తాండూరు

జవాబు: త్వరలో పట్టణంలోని పార్కులను సందర్శించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పార్కు స్థలంలో కార్ల పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి త్వరలో పనులను ప్రారంభిస్తాం.

ప్రశ్న: 35వ వార్డులో మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీధి దీపాలు కూడా వెలగడం లేదు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– సురేష్, తాండూరు

జవాబు: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తాం. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న:10వ వార్డులోని ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాల వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. సాయిపూర్ రోడ్డులో చెత్త వేస్తున్నారు. హనుమాన్, కట్ట మైసమ్మ ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు.

– శివ, 10వ వార్డు, తాండూరు

జవాబు: పాఠశాల వద్ద వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. రోడ్లపై చెత్త వేయరాదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు. ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపడతాం.

ప్రశ్న: వార్డు నంబర్ 31.. రైల్వే స్టేషన్ రోడ్డు మార్గంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. డీఎస్పీ కార్యాలయం వద్ద మురుగు కాల్వను శుభ్రం చేయడం లేదు. రెండు రోజులకు ఒక్కసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారు.

– అమ్జాద్ అలీ, అహ్మద్‌పాషా, తాండూరు

జవాబు: ఇళ్ల ముందు మురుగు కాల్వలను మూసి వేయడంతో సమస్య వస్తోంది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కాల్వలపై నిర్మించిన కట్టడాలని తొలగించాలి. అప్పుడే సమస్య పరిష్కారమవుతుంది. ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న: పాత తాండూరులోని 18వ వార్డులో మురుగు కాల్వలు లేవు. ఉన్నవి దెబ్బతిన్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– జావీద్, పాత తాండూరు

జవాబు: వార్డులో మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

సారే హాజరు.. విద్యార్థులే లేరు!

కుల్కచర్ల: ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా పలు చోట్ల సర్కారు బడులకు ఆదరణ కరువవుతోంది. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం కుస్మసముద్రం పంచాయతీ ఆలుగడ్డతండా ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకరు ఒకటో తరగతి, మరొకరు రెండో తరగతిలో ఇద్దరు విద్యార్థులు చేరారు. వీరికి పాఠాలు చెప్పేందుకు విద్యాశాఖ అధికారులు ఓ ఉపాధ్యాయుడిని నియమించారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత మూడు రోజులుగా ఆ ఇద్దరు కూడా బడికి రావడం లేదు. దీంతో ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి ఆరా తీయగా పూణెకు వలస వెళ్లిన తల్లిదండ్రులతో పాటు వెళ్లిపోయారని తెలుసుకుని అవాక్కయ్యాడు. ఇక చేసేదేమీ లేక బడికి వెళ్లి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విద్యార్థులు లేకపోవడంతో అట్టహాసంగా తెరుచుకున్న బడి మళ్లీ మూతపడే అవకాశముంది.



విద్యార్థులు లేక ఒక్కడే కూర్చున్న ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సన్మానం

అనంతగిరి: దేశ భవిష్యత్ దశ దిశను మార్చేది విద్యే అని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ పట్టణ పరిధిలోని ఎన్నెపల్లి మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అలాగే ఇటీవల కళాశాలలో వివిధ విభాగాలకు జరిగిన ఎన్నికల్లో నాయకులుగా ఎంపికైన విద్యార్థినులకు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య పట్ల సానుకూల శక్తితో ముందుకు వెళ్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా శ్రద్ధ, నిబద్ధత, క్రమశిక్షణతో ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్ యువత పైనే ఉందని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా మీదే అన్నారు. న్యాయ, వైద్య, ఐఐటీ తరగతులు నిర్వహించేందుకు చేయూత అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన మాక్ పోలింగ్ వీడియో ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ మహమూదా ఫాతిమా, రిటైర్డ్ డీఎండబ్ల్యూఓ హనుమంతరావు, నాయకులు హఫీజ్, అబ్దుల్ బషీర్, వెంకట్‌రెడ్డి, ఫక్రుద్దీన్, విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దుద్యాల్: ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని హకీంపేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఇంటర్ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. శ్రద్ధగా చదువుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, ఆలయ చైర్మన్ జయరాములు పాల్గొన్నారు. అనంతరం కళాశాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి సందర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కడా ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి ఉన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం

బొంరాస్‌పేట: కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మండల కేంద్రంలో ఈ ఏడాది కొత్తగా ప్రారంభమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల బోధనను పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటర్ విద్యతోపాటు ఎంసెట్, నీట్, ఐఐటీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కళాశాలకు 5నుంచి 10 కిలో మీటర్ల దూరం నుంచి వచ్చే విద్యార్థులకు త్వరలో ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని తెలిపారు. ఫర్నిచర్ కోసం రూ.2.50 లక్షలు వెంటనే మంజూరు చేస్తామన్నారు. మరుగుదొడ్ల లే ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెప్పడంతో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్నగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, అధ్యాపక బృందం దినేశ్, సురేశ్, శేఖర్, హరికృష్ణ, నాగరాజు, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

అడిషనల్ కలెక్టర్ సుధీర్

బంట్వారం: అర్హులైన వారిని (18 ఏళ్లు నిండిన) ఓటర్లుగా నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ సూచించారు. శుక్రవారం బంట్వారం మోడల్ స్కూల్‌లో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ మహేష్, ఎంపీఓ నాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా, ట్రైనర్స్ రవీందర్‌రెడ్డి, యాదయ్య, మధుసుదన్‌రెడ్డి, ఆర్‌ఐ రాంగోపాల్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి
- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



కొడంగల్ చెరువు సుందరీకరణ పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. కొడంగల్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో 112 ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ విద్యా బోధన కోసం 265 కంప్యూటర్లను అందజేశారు. కడా కార్యాలయంలో పలువురికి రూ.1,58,28,500 విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. పట్టణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.300 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ సమన్వయ కర్త కృష్ణంరాజు, నాయకులు నయీమ్, ఆసీఫ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, దాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరెడ్డిపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శ జంటకు ప్రభుత్వం ఆర్థికసాయం



దంపతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ జంటకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య అందజేశారు. మండల పరిధిలోని ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన మేకల శ్రీకాంత్ రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన సాయిహర్షితను ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే యాదయ్య శుక్రవారం కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు అందజేశారు. కార్యక్రమంలో నవాబుపేట ఎస్సీ హాస్టల్ వార్డెన్ శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

పూడూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో మంజూరైన ఇళ్లు ఏ దశలో ఉన్నాయని, కొలతల ప్రకారం మార్కింగ్ ఇస్తున్నారని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ క్రిష్ణయ్య, డీఈఈ ముక్రం, ఎంపీడీఓ పాండు పాల్గొన్నారు.

నిర్మాణ దారుడిపై కేసునమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికతో వెట్టిచాకిరి చేయిస్తున్న ఓ రియల్ ఎస్టేట్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఆదిబట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్ గూడ సమీపంలో అనిల్ కన్‌స్ట్రక్షన్ యజమాని, భవన నిర్మాణ రంగంలో జార్ఖండ్‌కు చెందిన 16 ఏళ్ల బాలికతో పనిచేయిస్తుండగా.. బాలికకు విముక్తి కల్పించారు. అనంతరం యజమానిపై కేసు నమోదు చేశారు.

యువకుడి దారుణ హత్య

చాంద్రాయణగుట్ట: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..బాబానగర్‌కు చెందిన అజీజ్ అక్తర్(26) ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడు. అతనిపై పలు దొంగతనం కేసులు ఉండడంతో కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్‌ను గతంలో ఓపెన్ చేశారు. ఉదయం బాలాపూర్ రోడ్డులోని నా లా పక్కన అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించా రు. చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్, సీఐ గోపీ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని మెడ, కడుపు, వీపుపై పదునైన ఆయుధంతో దాడి చేసిన ట్లుగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాసుల కక్కుర్తి



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు (ఫైల్)

- చికిత్సల పేరుతో ఘరానా మోసం
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ
- పట్టించుకోని వైద్యాధికారులు

పరిగి: ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకూ హెచ్చుమీరుతున్నాయి. శస్త్ర చికిత్సల పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అబార్షన్లు(గర్భస్రావం) సైతం చేస్తున్నారు. వైద్యం ముసుగులో ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాఫియా జరుగుతుంది. ఇందుకు నిదర్శనమే ఇటీవల పరిగి పట్టణ కేంద్రంలోని విజేత ఆస్పత్రిలో జరిగిన ఘటన. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు మాత్రం డబ్బులకు ఆశపడి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పట్టణ కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ప్రసవాలకే మొగ్గు చూపుతున్నారు. మాతాశిశు ఆరోగ్యం కోసం సాధారణ ప్రసవాలు చేయాలని చెబుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రైవేట్ వైద్యశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టానుసారంగా ఈ దందా నడుస్తోంది.

నిత్యం ఘటనలు

నిబంధనల ప్రకారం లింగ నిర్ధారణ, అబార్షన్‌లు చేయరాదని ప్రభుత్వం సూచిస్తున్నా ప్రైవేట్ ఆస్పత్రిలో మాత్రం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రసవాల పేరుతో ఈ దారుణాలు నిత్యకృత్యమైనా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గైనకాలజిస్టులు అడ్డగోలుగా ప్రసవాలు, అబార్షన్‌లు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. గర్భం దాల్చిన మహిళ 23 వారాల లోపు ఉండి, ఏదైనా సమస్య ఉంటే అందరి ఆమోదంతో అబార్షన్ చేయాలని నిబంధనాలున్నాయి. కానీ ఇటీవల విజేత ఆస్పత్రిలో జరిగిన ఘటనను చూస్తే 26 వారలకు పైగా కవలలు ఉన్నారని, ఆ గర్భిణికి ఎలాంటి ఇబ్బందులు లేకున్నా డబ్బులకు ఆశపడి అబార్షన్ చేశారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆస్పత్రి వర్గాలకు అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీ, ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

మామూళ్ల మత్తు

ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తున్న వారిలో రిస్క్, హైరిస్క్ ఉన్న వారికి మాత్రమే సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేస్తుండగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం ఎలాంటి రిస్క్, హైరిస్క్ లేకున్నా సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ప్రైవేట్ హాస్పిటల్‌లో ముహూర్తం ప్రకారం ప్రసవాలు చేస్తామని చెబుతుండటం గమనార్హం. అంతే కాకా గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణ ప్రసవాలు జరిగితే వచ్చే ఫీజు చాలా తక్కువ. సిజేరియన్‌ల ద్వారా దాదాపు రూ.70వేల నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంత తతంగం జరుగుతున్నా మామూళ్ల మత్తులో ఉన్న వైద్యారోగ్యశాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

పట్టణంలో ఇటీవల జరిగిన ఘటనపై ఆస్పత్రికి షోకాజ్ నోటీసులు అందజేశాం. ఎంటీపీ కమిటీ మీటింగ్ నిర్వహించి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. నోటీసులకు వచ్చే సమాధానంపై ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు.

– లలితాదేవి, జిల్లా వైద్యాధికారి

నొప్పలతో వస్తే కాన్పు చేశాం

పురిటి నొప్పులతో వస్తేనే కాన్పు చేశామని విజేత ఆస్పత్రి వైద్యురాలు నవత అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. నందిని అనే మహిళకు పెళ్లై ఏడాదిన్నర అయినా గర్భం దాల్చక పోవడంతో చికిత్స కోసం వచ్చిందన్నారు. దీంతో రెండు నెలల్లోనే ఆమె గర్భం దాల్చిందన్నారు. అప్పటి నుంచి ప్రతి నెలా ఇక్కడే చికిత్స చేయించుకుంటున్నారు. ఇటీవల నందిని భర్తకు ఆరోగ్యం బాగలేకపోయిన మధ్యలో చికిత్స చేయించుకుంది. ఆమెకు కడుపునొప్పి వచ్చిన ప్రతిసారీ కుటుంబసభ్యులు, అత్తామామకు చెప్పాం. నొప్పులతో ఈ నెల 7న ఆస్పత్రికి రావడంతో కాన్పు చేయాలని సూచించాం. ఈ విషయాన్నిఆమె అత్తామామకు తెలియజేశాం. రోగి పరిస్థితి విషమంగా ఉండటంతో కాన్పు చేశాం. కానీ అబార్షన్ చేశారని మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఉన్నతాధికారులకు ఈ వ్యవహారంపై నివేదిక అందజేశామని వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం



పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకట్

సీఐ వెంకట్

మోమిన్‌పేట: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సీఐ వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో సైబర్ నేరాల అప్రమత్తతపై విలేకరులతో మాట్లాడారు. ఫోన్ పోగొట్టుకున్న మరుక్షణమే సిమ్‌ను బ్లాక్ చేయించాలన్నారు. ప్రతిఒక్కరూ డిజిటల్ పేమెంట్స్ చేస్తుండటంతో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలో 8 సైబర్ కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం రూ.42,58,555లు పోగొట్టుకోగా రూ.8,65,778 రికవరీ చేశామని వెల్లడించారు. ఇంకా పెండింగ్‌లో రూ.1,81,105 ఉన్నాయన్నారు. మోమిన్‌పేటకు చెందిన శివకుమార్ ఫోన్ పోగొట్టుకోగా అందులో ఉన్న రూ.1,44,000 పోయాయి. ఇలానే మర్పల్లికి చెందిన రాజువి రూ.10 లక్షలు పోయాయి. వెంటనే స్పందించి సిమ్ బ్లాకు చేయడంతో మొత్తం రికవరీ చేశామన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కానిస్టేబుళ్లు జావిద్, అనిల్‌కుమార్ చాకచక్యంగా వ్యహరించి డబ్బులను రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించారని అభినందించారు. ఆయన వెంట ఎస్ఐ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి కబ్జాపై విచారణ

సంయుక్త సర్వే చేయాలని నిర్ణయించిన విజిలెన్స్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: అన్యాక్రాంతమవుతున్న అటవీ భూములపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'కొన్నది కొంత–కొల్లగొట్టింది ఎంతో, పోతులవాగు స్వాహ' తదితర కథనాలకు అటవీశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ ఆఫ్ చీఫ్ కన్జర్వేటర్ అధికారి సువర్ణ స్పందించారు. ఆమె ఆదేశం మేరకు శుక్రవారం మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ సమీప సర్వేనంబర్ 11లోని అటవీ భూమిలో విజిలెన్స్ అధికారులు పర్యటించారు. అటవీశాఖ విజిలెన్స్ డిస్ట్రిక్ట్ ఫారెస్టు ఆఫీసర్ రాజశేఖర్, ఎఫ్ఆర్ఓ వీరేశం, ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్, ఇతర అధికారులు ఫారెస్టు భూమి, ఎఫ్ బ్లాక్‌లోని గెజిట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఫారెస్టు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేయిస్తే అటవీ భూమి ఎంత ఆక్రమణకు గురైందో తెలుస్తోందని తేల్చారు. గతంలో కందకాన్ని ఇద్దరు వ్యక్తులు తమ పొలంలో కలుపుకొన్నట్లు విజిలెన్స్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అటవీ భూమి ఎంత, వాటి హద్దు లెక్కడ అనేది గుర్తించలేక పోయారు. జాయింట్ సర్వేలో హద్దులు గుర్తిస్తేనే ఫారెస్టు భూమి ఎంతమేరకు కబ్జాకు గురైందని బయటపడుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పీసీసీఎఫ్‌కు నివేదించేందుకు నిర్ణయించారు.



మ్యాప్‌లో ఫారెస్టు హద్దులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి రాజశేఖర్

అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వండి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య
- 15న నిర్వహించనున్న సభకు మందకృష్ణ రాక



మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పేర్కొన్నారు. ఈ నెల 15న నిర్వహించనున్న వీహెచ్‌పీఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వీహెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు చేయూత పెన్షన్లను రూ.4వేలకు పెంచాలని డిమాండ్‌తో వికారాబాద్ జిల్లా కేంద్రంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పెన్షన్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరో పోరాటానికి తాము సిద్ధమయ్యామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, నాయకులు సుధీర్, నర్సింలు, సుభాష్, పుష్పరాణి, పద్మమ్మ, జ్ఞానేశ్వర్ గౌడ్, రాజు, వెంకటయ్య, గౌసోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

గచ్చిబౌలి: మతిస్థిమితం లేని ఓ యువకుడు హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగ్నంగా తిరుగుతున్న ఓ యువకుడు శుక్రవారం ఉదయం రాఘవేంద్ర కాలనీలో రోడ్డులో హైటెన్షన్ టవర్ ఎక్కాడు. దీనిని గుర్తించిన వాహనదారులు, స్థానికులు అతడిని కిందికు దిగాలని కేకలు వేసినా వినకుండా టవర్ చివరి వరకు ఎక్కాడు. దీంతో వారు డయల్ 100కు సమాచారం అందించడంతో గచ్చిబౌలి పెట్రోల్ మొబైల్ సిబ్బంది అక్కడికి చేరుకుని కిందకు దిగాలని అతడికి నచ్చజెప్పారు. దాదాపు గంట సేపటి తర్వాత అతను కిందకు దిగిరావడంతో దుస్తులు వేయించి పీఎస్‌కు తీసుకెళ్లారు. అతడిని రాజరాజేశ్వరీనగర్‌లో నివాసం ఉంటున్న ఆకాష్ ఆర్యంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి తరలిస్తున్న వడ్డీవ్యాపారి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో సొంత భవనాలు, రూ.లక్షల్లో వడ్డీల వ్యాపారం, అయినా ఇంకా సంపాదించాలనే దురాశతో గంజాయి వ్యాపారం మొదలెట్టిన వడ్డీవ్యాపారి సికింద్రాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ సిబ్బందికి గంజాయితో సహా నారాయణగూడ వైఎంసీఏ వద్ద పట్టుబడ్డాడు. ఒరిస్సా నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా బైక్‌పై తీసుకువెళ్లి సరఫరా చేస్తున్న చెన్న రమేష్ గౌడ్ డీటీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. మల్లాపూర్ నుంచి కోఠి వైపు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై గంజాయిని తీసుకెళ్తుండగా సీఐ సావిత్రి సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఖలీం, కానిస్టేబుళ్ల రాజు, రవి, శిల్ప, సునీత, రమేష్, తదితరులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయితోపాటు రూ. 20వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

పార్టీలో అందరూ సమానమే

నారాయణపేట్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

తాండూరు: హస్తం పార్టీలో కొత్త, పాత అనే బేధాభావం లేదని అందరూ పార్టీ కుటుంబ సభ్యులేనని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి, నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి క్యాంపు కార్యాలయంలో పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న నాయకులతో పాటు ముఖ్య కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ పదవుల కోసం నియోజకవర్గం నుంచి వచ్చిన దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలిస్తున్నామన్నారు. పైరవీలతో ఏ నాయకుడికి పదవులు రావన్నారు. అందరూ సమష్టిగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించండి

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాలకు నిర్మిస్తున్న బీటీ రోడ్ల నాణ్యతపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ మహిపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బోడమర్రితండాకు వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో ఆయా గ్రామాలకు తండాలకు వేస్తున్న బీటీ రోడ్లను ఆంధ్రా కాంట్రాక్టర్లకు కమీషన్లకు అమ్ముకున్నారన్నారు. దీంతో వారు నాణ్యత లేకుండా రోడ్లును వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పకీరప్ప, ఆశప్ప, కేశవరెడ్డి. బాల్‌రాజు తదితరులున్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఊటుపల్లి అటవీ ప్రాంతంలో ఘటన



మల్లేశం (ఫైల్)

దోమ: ఇంట్లో వెళ్లిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గీ మున్సిపాలిటీ పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎదుల మల్లేశం(21) ఈ నెల 9న ఇంట్లో నుంచి హైదరాబాద్ నగరానికి వెళ్తున్నానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. అప్పటి నుంచి అతని ఫోన్ నంబర్లు కలవకపోవడం, నగరానికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు అతని ఫొటోతో పాటు బైక్ నంబర్‌లను వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయగా దోమ మండలంలోని ఊటుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందింది. శుక్రవారం గమనించగా అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొంత కాలంగా మృతుడు నగరంలో స్విగ్గి, రాపిడో డెలివరీ బాయ్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి అక్క శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవే యువమంచ్ లక్ష్యం



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

తాండూరు టౌన్: సామాజిక సేవా కార్యక్రమాలే మార్వాడీ యువమంచ్ లక్ష్యమని సంస్థ తాండూరు అధ్యక్షుడు అనిల్ సార్డా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీ మందిర్‌లో ది స్టార్ ఆసుపత్రి నానక్‌రాంగూడ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనిల్ సార్డా మాట్లాడుతూ.. సమాజానికి తమ వంతుగా ఏదో ఒకటి చేయాలనే తపనతో మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదానం, నేత్రదాన శిబిరాలు, చలివేంద్రాలు, ఉచిత కృత్రిమ అవయవాల అమరిక, పేద విద్యార్థులకు చేయూత వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్ వంటి సేవలతో పాటు మరిన్ని వైద్య సేవలను అందించామన్నారు. కార్యక్రమంలో మంచ్ క్యాంప్ చైర్మన్ దీపక్ బూబ్, తాండూరు ప్రధాన కార్యదర్శి సచిన్ రాఠీ, సభ్యులు అంకిత్ సార్డా, గిరిధర్ పర్తాని, రోహిత్ సోని, నిఖిల్ గగరాణి, దీపక్ సోని, సన్నీ అగర్వాల్, కుంజ్ బిహారీ సోని, మహేష్ సార్డా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాలకు ముప్పు

పరిగి: ప్లాస్టిక్ వాడటంతో మానవాళికి ముప్పు ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాటన్‌ని బ్యాగులు, వస్తువులకు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం రోజు రోజుకు పెరుగుతుండటంతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణాన్ని మనం కాపాడుకుంటే అది మనల్ని కాపాడుతుందన్నారు. అధికారులు కూడా ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ తదితరులు

నెల రోజులుగా గుడ్డు లేదు!

సర్కారు బడిలో విద్యనభ్యసించే చిన్నారులకు పోషకాహారం అందని ద్రాక్షగా మారింది. వేసవి సెలవుల అనంతరం స్కూల్ ప్రారంభమైన నాటి నుంచి మధ్యాహ్న భోజనంలో గుడ్డును ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

పాఠశాల తనిఖీకి వెళ్లి అవాక్కైన తహసీల్దార్

- నాలుగు నెలల నుంచి బిల్లులు రాలేదన్న నిర్వాహకులు
- అన్నం, పప్పుతో సర్దుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి బిల్లుల గండం వేధిస్తోంది. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. నిబంధనల ప్రకారం వారంలో మూడు రోజులు గుడ్డు అందజేయాలి. కానీ మండలంలోని చెన్‌గేస్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభం(జూన్ 12) నుంచి విద్యార్థులకు ఇప్పటి వరకు గుడ్డు ఇవ్వలేదు. దీంతో చిన్నారులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్ తారాసింగ్ అవాక్కయ్యారు. చెన్‌గేస్‌పూర్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పెరిగిన గుడ్డు ధర

అనంతరం చిన్నారులతో కలిసి తహసీల్దార్ సహపంక్తి భోజనం చేశారు. శుక్రవారం నాడు అన్నం, పప్పు, వెజిటెబుల్ కర్రి, గుడ్డు పెట్టాలని మెనూలో ఉంది. కానీ ఆ నిబంధనను అమలు చేయలేదు. దీంతో విద్యార్థులకు ఎందుకు గుడ్డు ఇవ్వలేదని ఆయన నిర్వాహకులను ప్రశ్నించారు. నాలుగు నెలల నుంచి తమకు బిల్లులు రావడం లేదని, అందుకే గుడ్డు పెట్టలేదని మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు సావిత్రమ్మ సమాధానమిచ్చారు. ఇప్పటి వరకు అప్పు చేసి సరుకులు తెచ్చి వడ్డిస్తున్నామని గోడును విలిబుచ్చారు. రూ.5 ఇవ్వాల్సిన గుడ్డును, రూ.6 ఇస్తున్నారని వాపోయారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఆయన వెంట హెచ్‌ఎం శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ బాబు, రికార్డు అసిస్టెంట్ ఉలేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.